ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 221
శుక్రవారం 21 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## స్థానిక పోరుకు జనసేన సై..

ఆ వ్యూహం గత ఎన్నికలకే పరిమితమన్న పవన్ కల్యాణ్
స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని జనసేనకు పవన్ పిలుపు
విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేలు, సీనియర్లతో ప్రత్యేక కమిటీ
సార్వత్రిక ఎన్నికలకు భిన్నంగా స్థానికాల్లో మెరుగైన స్థాయిలో పోటీ
గత ప్రభుత్వ హయాంలో పోరాడిన శ్రేణుల స్ఫూర్తిని గౌరవిస్తామని హామీ
కొన్నిచోట్ల కూటమి ధర్మం పాటించడం లేదని ఎమ్మెల్యేల ప్రస్తావన



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 20)
రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సమాయత్తమవుతోంది. ఈ ఎన్నికలే లక్ష్యంగా పక్కా వ్యూహంతో ముందుకు సాగాలని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించిన వ్యూహానికి భిన్నంగా, క్షేత్రస్థాయి బలాబలాలకు అనుగుణంగా ఈ ఎన్నికల్లో జనసేన ప్రభావశీలమైన పోటీ ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు ▶2లో

## చంద్రబాబుకు జగన్ సవాల్

లోకేశ్‌ను కాపాడేందుకే గ్రూప్-1పై తప్పుడు ప్రచారమన్న జగన్
గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల, ప్రిలిమ్స్ టీడీపీ హయాంలోనే జరిగాయని వెల్లడి
హైకోర్టు ఆదేశాలతోనే మాన్యువల్ మూల్యాంకనం చేశామని స్పష్టీకరణ
హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరగలేదని, సిట్ దర్యాప్తుపై విమర్శలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 20)
ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాల నుంచి కుమారుడు నారా లోకేశ్‌ను కాపాడుకునేందుకే, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని జగన్ ధ్వజమెత్తారు. గ్రూప్-1 వ్యవహారంపై



సీబీఐ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని, డీఎస్సీ కుంభకోణంపై సీబీఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. డీఎస్సీపై దర్యాప్తు చేయాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గురించి వివరించారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వమే హడావిడిగా ▶2లో

## అసెంబ్లీకి వచ్చి మాట్లాడే ధైర్యం లేని జగన్

బయట ఆయన వ్యాఖ్యలకు విలువ లేదు
సీఎం చంద్రబాబు ధ్వజం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 20)
వైకాపా అధ్యక్షుడు జగన్ అసెంబ్లీకి రాకుండా... బయట చెప్పే మాటలకు విశ్వసనీయత లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. వైకాపా చేస్తున్నవన్నీ తప్పుడు ప్రచారాలని, వాటిని అసెంబ్లీకి



వచ్చి చెప్పే ధైర్యం లేదు కాబట్టే బయట నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. బుధవారం శాసనసభలోని తన కార్యాలయం వద్ద విలేకర్లతో చంద్రబాబు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'ప్రజా సమస్యలపై శాసనసభలో మాట్లాడితే వాటికి ఒక విలువ, గుర్తింపు ఉంటాయి. వైకాపా సభ్యులు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలు లేవనెత్తితే వాటిపై చర్చిస్తాం. దాన్ని ప్రజలంతా చూస్తారు. పాలకపక్షం తప్పులు చేస్తుంటే చట్టసభల్లో నిలదీయడం, వారి అభిప్రాయాల్ని తెలియజేయడం ప్రతిపక్షాల బాధ్యత. వైకాపా ఆ బాధ్యతను ▶2లో

## సముద్రంలో మత్స్యకారుడు గల్లంతు.. గాలింపు ముమ్మరం చేయాలని హోం మంత్రి ఆదేశం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 20)
సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు అప్పన్న ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, కోస్ట్‌గార్డ్ సమన్వయంతో విస్తృతంగా గాలింపు చేపట్టాలని సూచించారు. ఈనెల 16న 8 మంది మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా.. సముద్ర తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ప్రమాదం జరిగిందని, ఈ ఘటనలో అప్పన్న గల్లంతయ్యారని ▶2లో




## ట్రంప్‌ది 'ఆర్థిక ఉగ్రవాదం'.. ఓటమి తప్పదు: ఇరాన్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 20)
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశంపై ఆర్థిక యుద్ధం ప్రకటించడాన్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. భారీగా అప్పులు, విపరీతంగా పెరుగుతున్న వడ్డీ ఖర్చుల వంటి స్వీయ సంక్షోభాల నుంచి దృష్టి మళ్లించే చర్యగా దీనిని పేర్కొంది. విఫలమైన విధానాలను కొనసాగించడం వల్ల మున్ముందు కూడా ఓటమిని, ఇరాన్ ప్రజల శత్రుత్వాన్ని మూటగట్టుకోవడం తప్ప ఏమీ సాధించలేరని తెలిపింది.అమెరికా 'ఆర్థిక ఉగ్రవాదం'.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, సార్వభౌమాధికారానికి ముప్పు కలిగిస్తుందని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అమెరికా అప్పులు 40 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయనే సూచించే మీడియా నివేదికలను ▶2లో

## వ్యవసాయ రంగంపై చర్చకు సిద్ధమా?.. జగన్‌కు మంత్రి అచ్చెన్న సవాల్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 20)
రైతులకు ఎవరి పాలనలో మేలు జరిగిందో చర్చించేందుకు సభలోనైనా, బయటైనా తాము సిద్ధమని, జగన్ ముందుకు రావాలని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. గిట్టుబాటు ధర అందని సమయంలో రైతులను అన్నివిధాలా ఆదుకుంటున్నామని వెల్లడించారు. అన్నదాత-సుఖీభవ నిధుల విషయమై తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. వెబ్‌ల్యాండ్‌లో దాదాపు 29 మంది ఖాతాల వివరాలు తప్పుగా ఉన్నాయని వాటిని సరి చేస్తున్నామన్నారు. కేంద్రం నిధులు విడుదల చేసిన వెంటనే రాష్ట్ర వాటా కూడా ఇస్తున్నామని తెలిపారు. పొగాకు, మామిడి పంటలకు మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నామన్నారు. గొడ్డలి పార్టీ నేతలు సభకు రాకుండా.. వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శలు చేయడం దారుణమన్నారు.

## 'వందేమాతరాన్ని విడగొట్టి.. దేశ విభజనకు పునాది వేసి'



### కాంగ్రెస్‌పై అమిత్ షా ధ్వజం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 20)
జాతీయ గేయం 'వందేమాతరం'ను పూర్తిగా ఆలపించే విషయంలో భాజపా-కాంగ్రెస్ మధ్య మొదలైన వివాదం మరింత ముదురుతోంది. ఈ గేయాన్ని పూర్తిగా పాడబోమంటూ కాంగ్రెస్ చేసిన ప్రకటనపై భాజపా నేతలు మండిపడుతున్నారు. తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ.. కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. స్వాతంత్ర్య సమరయోధులను ఆ పార్టీ అవమానిస్తోందని దుయ్యబట్టారు. వారి బుజ్జగింపు రాజకీయ విధానాలకు ఇది నిదర్శనమని విమర్శించారు."కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ నిన్న అనూహ్యమైన, దేశ వ్యతిరేక నిర్ణయం తీసుకుంది. వందేమాతరం రెండు చరణాలే పాడుతామని తెలిపింది. ▶2లో

## జగన్ APPSC, DSC ఒకటే అనుకుంటున్నారు: లోకేశ్ ఎద్దేవా



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 20)
వైకాపా అధ్యక్షుడు జగన్ ఏపీపీఎస్సీ, డీఎస్సీ రెండూ ఒకటే అని అనుకుంటున్నారని మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో జగన్ చేసిన వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా లోకేశ్ పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ పరీక్షలు నిర్వహిస్తుందో.. ఆ విధి విధానాలేంటో కనీసం తెలియని జగన్ తన పాలనా కాలంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేకపోయారన్నారు. ఇప్పుడు అసెంబ్లీలో చర్చకు రాకుండా పారిపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ ఒకటే అనేవిధంగా జగన్ చేసిన వ్యాఖ్యల వీడియోను ఈ సందర్భంగా లోకేశ్ పోస్ట్ చేశారు.



## ఏలేరు ఆయకట్టుకు 950 క్యూసెక్కుల నీరిస్తున్నాం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 20)
ఏలేరు పరిధిలోని ఆయకట్టుకు 950 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని.. ఇప్పటి వరకు 2.6 టీఎంసీల జలాలను పంపిణీ చేశామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏలేరు కాల్వ బెడ్ రెగ్యులేటర్లపై శాసనసభలో ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, యనమల దివ్య అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. గత ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో ఏలేరు నదీగర్భంలో అక్రమ ఇసుక తవ్వకాలు చేయడంతో బెడ్ లెవల్ పడిపోయిందని.. అందుకే గ్రావిటీ ద్వారా ▶2లో

## ప్రత్యక్ష ఎన్నికలతో బలమైన ప్రజామోదం లభిస్తుంది

శాసనసభలో మంత్రి నారాయణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 20)
మేయర్, పురపాలక ఛైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికైన వారికి బలమైన ప్రజామోదం లభిస్తుందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. శాసనసభలో బుధవారం ఏపీ పురపాలక శాసనాల నాలుగో సవరణ బిల్లును మంత్రి నారాయణ ప్రవేశ పెట్టారు. దీనికి సభ ఆమోదం తెలిపింది. ▶2లో



## మొదటిపేజీ తరువాయి

# చంద్రబాబుకు జగన్ సవాల్

ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే మే 26న ప్రిలిమ్స్ పరీక్ష కూడా పూర్తయిందని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించి, 2020 డిసెంబర్‌లో మెయిన్స్ నిర్వహించామని తెలిపారు. టీడీపీ హయాంలోనే జరిగిన పరీక్షలో ఎంపికైన వారికి ఇప్పుడు రాజకీయ రంగు పులమడం దారుణమని అన్నారు.

కోవిడ్ కారణంగా మూల్యాంకనం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో ఏపీపీఎస్సీ కమిషన్ డిజిటల్ మూల్యాంకనానికి నిర్ణయం తీసుకుందని, అయితే దీనిపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారని జగన్ వివరించారు. నోటిఫికేషన్‌లో పేర్కొననందున, హైకోర్టు ఆదేశాల మేరకు డిజిటల్ మూల్యాంకనాన్ని పూర్తిగా పక్కనపెట్టి, మాన్యువల్ పద్ధతిలోనే జవాబు పత్రాలను దిద్దామని స్పష్టం చేశారు. ఆ మార్కుల ఆధారంగానే 163 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చామని, ఈ ప్రక్రియ మొత్తం హైకోర్టు పర్యవేక్షణలోనే జరిగిందని తెలిపారు. ఇప్పుడు సంబంధం లేని డిజిటల్ మూల్యాంకనంపై ఆరోపణలు చేయడం కేవలం ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవడమేనని విమర్శించారు.గ్రూప్-1 మూల్యాంకనం హాయ్‌ల్యాండ్‌లో జరిగిందంటూ చేస్తున్న ప్రచారాన్ని జగన్ తీవ్రంగా ఖండించారు. అక్కడ ఎలాంటి మూల్యాంకనం జరగలేదని, ఈ విషయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నియమించిన సిట్ కూడా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొందని గుర్తుచేశారు. తమపై బురద జల్లేందుకు దర్యాప్తు బృందాలను వాడుకోవడం చంద్రబాబుకు అలవాటేనని ఆరోపించారు. నాలుగేళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారిపై విషం కక్కుతూ, వారి భవిష్యత్తును నాశనం చేయాలని చూడటం సరికాదని జగన్ హితవు పలికారు. ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా చివరకు నిజమే గెలుస్తుందని ఆయన అన్నారు.

# అసెంబ్లీకి వచ్చి మాట్లాడే ధైర్యం లేని జగన్

పూర్తిగా విస్మరించింది. దేవాలయం వంటి అసెంబ్లీని ఒక పార్టీ పూర్తిగా బహిష్కరించడం చరిత్రలో లేదు. అసలు శాసనసభకు వచ్చి చర్చల్లో పాల్గొనని పార్టీకి ప్రజలు ఎందుకు ఓట్లేయాలి?' నిలదీశారు.

వైకాపా ప్రభుత్వ హయాంలో వారి అరాచక ప్రవర్తనకు నిరసనగా నేను సభకు వెళ్లకపోయినా, మా సభ్యులు చివరి రోజు వరకు పోరాటం వదల్లేదు. వైకాపా నాయకులు వారి ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాల్ని కప్పిపుచ్చుకునేందుకే సభకు రాకుండా, బయట కూర్చుని డీఎస్సీపై బురదజల్లుతున్నారు' అని చంద్రబాబు విమర్శించారు.

# 'వందేమాతరాన్ని విడగొట్టి.. దేశ విభజనకు పునాది వేసి'
## : కాంగ్రెస్‌పై అమిత్ షా ధ్వజం

ఈ సందర్భంగా దేశ ప్రజలందరికీ నేనో విషయం గుర్తుచేయాలనుకుంటున్నా..! 1937లో ముస్లింలను బుజ్జగించడం కోసం.. వందేమాతర గేయాన్ని రెండుగా విడగొట్టి దేశ విభజనకు పునాది వేసింది. నాటి నుంచే ద్విజాతి సిద్ధాంతం బలపడి.. చివరకు దేశ విభజన జరిగి పాకిస్థాన్ ఉద్భవించింది" అని అమిత్ షా వెల్లడించారు."కాంగ్రెస్ చేసిన ఆ చారిత్రక తప్పిదాన్ని ఇప్పుడు మోదీ సర్కారు సరిదిద్దింది. వందేమాతర గేయాన్ని పూర్తిగా ఆలపించడం ద్వారా జాతీయ సమైక్యతను బలోపేతం చేయడానికి మా ప్రభుత్వం కృషి చేస్తోంది. అంతేకాదు.. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో ఈ గేయాన్ని పూర్తిగా పాడలన్న మా నిర్ణయం చట్టబద్ధం కూడా..! కానీ, కాంగ్రెస్ దాన్ని విస్మరించింది. ఈ విషయంలో ఆ పార్టీ వైఖరి.. వారి అతివాద బుజ్జగింపు రాజకీయ విధానాన్ని ధ్రువీకరిస్తోంది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వారు.. వందేమాతర గేయ రచయితతో పాటు.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఎంతోమంది అమరవీరులను అవమానిస్తున్నారు" అని కేంద్రమంత్రి ధ్వజమెత్తారు.

"ఒకసారి వందేమాతరాన్ని రెండుగా విడగొట్టినందుకు ఎంత తీవ్రమైన పర్యవసానాలు ఎదుర్కొన్నామో మనందరికీ తెలుసు. ఇప్పుడు మరోసారి ఆ తప్పు జరగకుండా చూద్దాం. కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని యావత్ దేశం ముక్తకంఠంతో వ్యతిరేకించాలి. బుజ్జగింపు రాజకీయాలు ఇక పనిచేయవు అని మనమంతా చాటిచెప్పాలి" అని అమిత్ షా పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.బుధవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో 'వందేమాతరం' గేయంపై కాంగ్రెస్ తమ దృఢ వైఖరిని ప్రకటించిన సంగతి తెలిసిందే. స్వాతంత్ర్యోద్యమ సమయంలో 1937లో తమ పార్టీ తీర్మానానికి ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని, వందేమాతర గేయం తొలి రెండు చరణాలను మాత్రమే పాడుతామని స్పష్టం చేసింది.

# ఏలేరు ఆయకట్టుకు 950 క్యూసెక్కుల నీరిస్తున్నాం

నీరందించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. జలాశయ నిర్వహణ, మరమ్మతులకు గత ప్రభుత్వం రూపాయి కూడా నిధులివ్వలేదని ధ్వజమెత్తారు. 'పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోగా ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు నీరందించాలనే ముందుచూపుతో చంద్రబాబు పురుషోత్తపట్నం ఎత్తిపోతల నిర్మించారు. ఎల్‌నినో వంటి క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లోనూ 53 వేల ఎకరాల ఏలేరు ఆయకట్టు, 1.48 లక్షల ఎకరాల పుష్కర ఆయకట్టుకు సాగు, తాగునీరు అందిస్తున్నాం' అని చెప్పారు. 'గత ప్రభుత్వం ఉత్తరాంధ్రకు సాగు, తాగునీరు అందించే పోలవరం ఎడమ కాలువ పనుల్ని నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్లలోనే పోలవరం ఎడమ కాలువ పనులపై రూ.1,800 కోట్లు ఖర్చు చేశాం. వేర్వేరు చోట్ల క్రాసింగ్ పనులు పూర్తి చేశాం. ఏలేరు ఆయకట్టు పరిధిలో 548 పనులకు రూ.25 కోట్లు వెచ్చించాం. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనల మేరకు రూ.15.84 కోట్లతో ప్రతిపాదనలు పంపాం' అని వివరించారు.

గూడూరు నియోజకవర్గంలో యల్లసిరి కాలువ పనులకు సంబంధించి రూ.28.50 కోట్లతో ప్రతిపాదనలు ఆర్థికశాఖకు పంపామని.. అనుమతి రాగానే పనులు చేపడతామని మంత్రి రామానాయుడు మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**బెడ్ రెగ్యులేటర్ ఏర్పాటు చేయాలి**

తక్కువ నీటితో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరందించేలా కాల్వల్ని సిద్ధం చేయాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. గోనేటి బెడ్ రెగ్యులేటర్ ఏర్పాటు చేయాలని.. ఫేజ్-1 ఆధునికీకరణలో మిగిలిన పోయిన నిధుల్ని దీనికి కేటాయించాలని కోరారు. 600 క్యూసెక్కులతోనే 53 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా కార్యాచరణ తయారు చేయాలన్నారు. బెడ్‌లెవల్ సరిగా లేకపోవడం వల్లే తుని నియోజకవర్గ పరిధిలోని చివరి భూములకు నీరందడం లేదని ఎమ్మెల్యే యనమల దివ్య వివరించారు.

గూడూరు నియోజకవర్గంలో సాగు నీరందించే కండలేరు-సత్యసాయి గంగ పరిధిలో 13 కి.మీ మేర విస్తరించిన యల్లసిరి కాలువ పనులు నిలిచిపోయాయని.. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చెప్పారు. నాయుడుపేట, చిట్టమూరు మండలాల్లో సాగు, తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 11.67 కి.మీ. మేర పనులు చేయాల్సి ఉందని వివరించారు.

# ప్రత్యక్ష ఎన్నికలతో బలమైన ప్రజామోదం లభిస్తుంది

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఇకపై మేయర్, పురపాలక ఛైర్మన్‌ల ఎంపికకు ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతాయి. ఇప్పటి వరకూ మేయర్, పురపాలక ఛైర్మన్‌లను పరోక్ష పద్ధతిలో ఎన్నుకుంటున్నారు. 1986 వరకు మేయర్, పురపాలక ఛైర్మన్‌ల ఎంపికకు పరోక్ష ఎన్నికలు జరిగేవి. ఆ తర్వాత నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. 2005 నుంచి ఇప్పటి వరకు పరోక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పుడు చేస్తున్న చట్ట సవరణలో ఇక నుంచి ఈ ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో జరుగుతాయి. ప్రత్యక్ష ఎన్నిక జరగడం వల్ల మేయర్, ఛైర్మన్‌లపై కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం ఉండదు. వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. మేయర్, ఛైర్మన్ పదవులపై రాజకీయ ప్రభావం తగ్గుతుంది" అని తెలిపారు.

# ట్రంప్‌ది 'ఆర్థిక ఉగ్రవాదం'.. ఓటమి తప్పదు: ఇరాన్

ఆయన ప్రస్తావించారు. ఆర్థిక క్రమశిక్షణను పునరుద్ధరిస్తానని అధ్యక్షుడు ట్రంప్ హామీ ఇచ్చినప్పటికీ.. ఆయన అనుసరించిన అనేక విధానాలు రుణ భారాన్ని మరింత పెంచాయని అవి పేర్కొన్నాయి.

**హర్మూజ్‌లో అమెరికా రహస్య షిప్పింగ్ కారిడార్**

ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ట్రంప్ కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఇరాన్‌కు సాయం చేసే దేశాలు ఆర్థికంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇరాన్ ముప్పును ఎదుర్కోడానికి, దాన్ని ఏకాకిని చేసి, ఓడించడానికి మిత్రదేశాలన్నీ తమతో కలిసి నిలబడాలని పిలుపునిచ్చారు. ఆ దేశం ఎప్పటికీ అణ్వాయుధం కలిగి ఉండకూడదని 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ పెట్టారు.

# సముద్రంలో మత్స్యకారుడు గల్లంతు.. గాలింపు ముమ్మరం చేయాలని హోం మంత్రి ఆదేశం

అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన మత్స్యకారుల పరిస్థితిపైనా అనిత ఆరా తీశారు. గల్లంతైన అప్పన్నను క్షేమంగా గుర్తించి కుటుంబసభ్యుల వద్దకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని ఆదేశించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని హోంమంత్రి తెలిపారు.

# స్థానిక పోరుకు జనసేన సై..

అవసరమైన విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం శాసనసభ ప్రాంగణంలోని తన కార్యాలయంలో జరిగిన జనసేన శాసనసభ పక్ష సమావేశంలో ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఎన్నో దాడులు, బెదిరింపులు, ఒత్తిళ్లు ఎదురైనా ధైర్యంగా నిలబడిన జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని ఎప్పటికీ విస్మరించబోమని అన్నారు. వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ఈ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. "నామినేషన్ వేయలేని పరిస్థితులు సృష్టించినా, అప్పటి పాలకులను ఎదిరించి పోటీలో నిలిచిన మన శ్రేణుల త్యాగం విలువైనది. వారి స్ఫూర్తికి తగిన గౌరవం దక్కేలా ఈసారి జనసేన నిలబడుతుంది" అని ఆయన పేర్కొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, అప్పటి దాష్టీక పాలనను అంతం చేయాలనే లక్ష్యంతోనే జనసేన కేవలం 21 స్థానాలకు పరిమితమై పోటీ చేసిందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఆ వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే పరిమితమని, స్థానిక ఎన్నికల్లో ప్రాంతాలవారీగా రాజకీయ, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు ఉంటాయని వివరించారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకే పరిమితం కాకుండా, తమ పరిధిలోని ఇతర ప్రాంతాల్లో జనసేన బలాబలాలను అంచనా వేయాలని ఆదేశించారు. పోటీకి అనువైన స్థానాలను గుర్తించి, పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని సూచించారు.రాబోయే ఎన్నికల కార్యాచరణ, విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది సభ్యులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ కమిటీ పనిచేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో కొందరు ఎమ్మెల్యేలు, కొన్ని నియోజకవర్గాల్లో మిత్రపక్షాల నేతల వైఖరి వల్ల శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతోందని, కూటమి ధర్మానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్, ఈ అంశాలు తన దృష్టిలో ఉన్నాయని, పార్టీ శ్రేణుల మనోభావాలను తప్పక గౌరవిస్తామని హామీ ఇచ్చారు. వారికి రాజకీయంగా అండగా నిలుస్తూ, మెరుగైన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

ఈ సుదీర్ఘ సమావేశంలో రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ నాగబాబు, రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్, ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్ సహా పలువురు జనసేన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# దేవినూతల అగ్నిప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల సాయం



(షణ్ముఖ వెలుగు, చీరాల, ఆగస్టు 20)

దేవినూతలలో అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన మూడు బాధిత కుటుంబాలకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశాల మేరకు ఆయన తనయుడు, చీరాల నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ మద్దులూరి మహేంద్రనాథ్ గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. గోనబోయిన పెద్ద అంకయ్య, గోనబోయిన చిన్న అంకయ్య, గడ్డం చలపతిరావు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున సాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం, పార్టీ తరపున అండగా ఉంటామని మహేంద్రనాథ్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సేవకు గుర్తింపు... నాయకత్వానికి సన్మానం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 20)

దోర్నాల మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో దోర్నాల ఎంపీపీ గుమ్మ పద్మజ యల్లేష్ అధ్యక్షతన ఎంపిటిసిలందరినీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హాజరై దోర్నాల ఎంపీపీ గుమ్మ పద్మజ, ఎంపీటీసీ సభ్యులందరికీ ఘనంగా సత్కరించారు. ప్రజా సేవలో ముందుండే ప్రజా ప్రతినిధులను గౌరవించడం మన బాధ్యత అని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీల సేవలకు ఈ సన్మానం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దోర్నాల వైసీపీ మండల కన్వీనర్ గంట రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సద్భావన దివాస్ సందర్భంగా విద్యార్థులకు న్యాయ విజ్ఞాన అవగాహన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

సద్భావన దివాస్ సందర్భంగా గురువారం ఒంగోలు పట్టణంలోని పీవీఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సిహెచ్‌వి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి "నేషనల్ ఇంటిగ్రేషన్, హార్మనీ అండ్ లీగల్ సర్వీసెస్" అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ దేశంలో ఐక్యత, సోదరభావం, సామరస్యం పెంపొందించడంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవంతో, స్నేహభావంతో మెలగాలని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండేలా న్యాయ సేవాధికార సంస్థలు అందిస్తున్న ఉచిత న్యాయ సేవలు, న్యాయ సహాయం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకొని సమాజంలో న్యాయం, సమానత్వం, శాంతి, సామరస్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె ఆలీ బాబు, లెక్చరర్లు మాధవరావు, విశ్వనాథ్, మాల్యాద్రి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన జిల్లా కమిటీని సత్కరించిన పిఎనఆర్ ఫౌండేషన్



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఆగస్టు 20)

కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని పిఎనఆర్ ఫౌండేషన్ ఘనంగా సత్కరించింది. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు కేవీ సుబ్బారావు, సెక్రటరీ సీవీ నాగేశ్వరరావు, ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్లను పిఎనఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, ప్రముఖ బిల్డర్ పెసల నాగరాజ, ఆయన కుటుంబ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి, తమ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పిఎనఆర్ షాపింగ్ మాల్ అబిరా శారీ మందిర్ అండ్ కిడ్స్ వేర్ నూతన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కమిటీ సభ్యులను నాగరాజ సాదరంగా ఆహ్వానించారు. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. నూతనంగా ప్రారంభించిన పిఎనఆర్ షాపింగ్ మాల్ అభిరా శారీ మందిర్ అండ్ కిడ్స్ వేర్ వారి వ్యాపారం దినదిన అభివృద్ధి చెందాలని జిల్లా అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ మరియు పలువురు కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
21.08.26 శుక్రవారం


# 3 కొత్త పీహెచ్‌సీలు మంజూరు చేయండి

**పీహెచ్‌సీలే అత్యవసర ప్రాణరక్షక కేంద్రాలు**

**అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే ఏలూరి గళం**

**వలపర్ల, పెద్దగంజాం, మోటుపల్లిలలో నూతన పీహెచ్‌సీల ఏర్పాటుకు విజ్ఞప్తి**

**మంత్రికి గతంలోనే లేఖ ద్వారా విన్నపం**

**తాజాగా సభలో మరోమారు కోరిన ఎమ్మెల్యే**

**రాష్ట్ర వ్యాప్తంగా 140కి పైగా కేంద్రాల ఆవశ్యకత**

**శిథిలావస్థలో పాత భవనాలు ఉన్న పీహెచ్‌సీలకూ మెరుగైన పరికరాలు, వైటల్స్ కల్పించండి**



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 20)**

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు క్షణాల్లో చికిత్స అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే (పీహెచ్‌సీలు) నిజమైన అత్యవసర ప్రాణరక్షక వ్యవస్థలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అసెంబ్లీలో అభిప్రాయపడ్డారు. సకాలంలో ప్రథమ చికిత్స అందితేనే ఎన్నో అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోగలమని, అందుకు గ్రామస్థాయిలో పీహెచ్‌సీల లభ్యత అత్యంత కీలకమని ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం అసెంబ్లీలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువ చేయాలన్న లక్ష్యంతో వలపర్ల, పెద్దగంజాం, మోటుపల్లి గ్రామాల్లో కొత్తగా మూడు పీహెచ్‌సీలు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై గతంలోనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి లేఖ రాసినట్లు గుర్తుచేస్తూ, తాజాగా అసెంబ్లీ వేదికగా మరోమారు విజ్ఞప్తి చేశారు.

**సీహెచ్‌సీలు సుదూరం...ప్రజలకు నిత్య ఇక్కట్లు**

జనసాంద్రత అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీలు) చాలా దూరంగా ఉండటంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే ఏలూరి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనే వైద్య సేవలు అందుబాటులో ఉంటే సకాలంలో చికిత్స అందించి ఎన్నో ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

**140కి పైగా కేంద్రాల ఆవశ్యకత...**
**శిథిలావస్థలో పాత భవనాలు**

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 140 కొత్త పీహెచ్‌సీలు అవసరమని ఇప్పటికే గుర్తించినట్లు, వాస్తవ సంఖ్య ఇంకా అధికంగానే ఉండే అవకాశం ఉందని ఎమ్మెల్యే వెల్లడించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన పీహెచ్‌సీ భవనాలు కనీస సదుపాయాలు లేక, పెచ్చులూడిపోతూ శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని తక్షణమే పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సభ దృష్టికి తెచ్చారు.

**ప్రాథమిక వైద్య పరికరాల కొరత పైనా దృష్టి**

ఇప్పటికే ఉన్న పీహెచ్‌సీలకు మరింత మెరుగైన వైద్య పరికరాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కూడా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. రోగుల ప్రాథమిక ఆరోగ్య పరిస్థితిని (వైటల్స్) నమోదు చేసేందుకు అవసరమైన కనీస వైద్య పరికరాలను పీహెచ్‌సీలకు సమకూర్చాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ, ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని మంత్రిని ఎమ్మెల్యే ఏలూరి కోరారు.

# వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలను వీలైనంత త్వరగా తరలించండి

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 20)**

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలను వీలైనంత త్వరగా పునరావాస ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు. గురువారం మార్కాపురం కలెక్టరేట్‌లో నిర్వాసిత గ్రామాల ప్రజల తరలింపు, సమస్యల పరిష్కారం (గ్రీవెన్స్), పరిహారం చెల్లింపు తదితర అంశాలపై జిల్లా స్థాయి అధికారులు, తహశీల్దార్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్వాసిత గ్రామాల ప్రజలతో సానుకూలంగా మాట్లాడి, ప్రస్తుత పరిస్థితులను సమగ్రంగా వివరించి తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే రూ. 200 కోట్లు విడుదల చేసిందని, మిగిలిన బాధితులకు కూడా త్వరలోనే పరిహారం అందుతుందని స్పష్టం చేస్తూ, ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని అధికారులను ఆదేశించారు. గెజెట్ నోటిఫికేషన్ నాటికి 18 ఏళ్లు నిండి పరిహారం అందని వారు, పేర్లలో తప్పులు ఉన్నవారి వివరాలను సేకరించి, పరిహారం అందని వారిని గుర్తించి తగిన న్యాయం చేయాలన్నారు. పునరావాస ప్రక్రియ కోసం కేటాయించిన ప్రత్యేక బృందాల సభ్యులందరూ ఖచ్చితంగా క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధులకు ఎవరూ గైర్హాజరు కాకుండా, సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. పునరావాస కాలనీలలోని లేఅవుట్లలో ఇంకా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, మౌలిక వసతులకు సంబంధించిన పనులను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మార్కాపురం, కనిగిరి ఆర్డీఓలు వెంకట శివరామిరెడ్డి, అజయ్ కుమార్, జిల్లా మైనింగ్ అధికారి రవి ప్రసాద్, డ్వామా పీడీ సువార్త, డీఆర్‌డీఏ పీడీ శివన్నారాయణ, జిల్లా వ్యవసాయశాఖ ఇన్‌చార్జ్ అధికారి బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా తయారీకి నోటీసుల జారీ

**అభ్యంతరాల స్వీకరణ వేగంగా పూర్తి చేయాలి**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 20)**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా తయారీకి నోటీసుల జారీ, అభ్యంతరాల స్వీకరణ వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం ఆయన రాజధాని అమరావతి నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా రూపొందించడానికి ఈ నెల 22, 23, 29, 30 తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలని వివేక్ యాదవ్ సూచించారు. నోటీసుల జారీ ప్రక్రియ అత్యంత వేగంగా పూర్తి చేయాలన్నారు. అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన వెనువంటనే చేపట్టాలన్నారు. ప్రత్యేక స్పెషల్ క్యాంపెయిన్ కార్యక్రమాల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనాకుమారి ఈ సందర్భంగా ఆయనకు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో ఢిల్లీ రావు, జిల్లా నుంచి డిఆర్‌ఓ వెంకటరమణ, ఆర్డీవోలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం సర్కిల్ పనితీరు పై సమగ్ర సమీక్ష

## వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరానే ప్రధాన లక్ష్యం

## సీఎండీ పుల్లారెడ్డి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 20)**

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ గౌరవ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి పుల్లారెడ్డి అధ్యక్షతన మార్కాపురం సర్కిల్ పనితీరు పై విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయం నుండి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ సరఫరా నాణ్యత, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం, రెవెన్యూ వసూళ్లు, లైన్ లాస్ తగ్గింపు, విద్యుత్ చౌర్యం నియంత్రణ, విద్యుత్ భద్రత, లైన్‌లు మరియు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, వర్షాకాల అత్యవసర సన్నద్ధత, సబ్‌స్టేషన్లు, ఫీడర్ల పనితీరు, విద్యుత్ అంతరాయాల నియంత్రణ, పీక్ డిమాండ్ నిర్వహణ తదితర అంశాల పై సవివరంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ పి పుల్లారెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పుడు అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి, విద్యుత్ పంపిణీ వ్యవస్థలో లోపాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.




**విద్యుత్ అంతరాయాలపై ప్రత్యేక దృష్టి**

విద్యుత్ సరఫరాలో అంతరాయాలను కనిష్ట స్థాయికి తీసుకురావాలని, తరచూ ట్రిప్పింగ్‌కు గురయ్యే ఫీడర్లు, ఓవర్‌లోడ్ అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు, బలహీనంగా ఉన్న విద్యుత్ లైన్లను గుర్తించి ముందస్తు నిర్వహణ చర్యలు చేపట్టాలని గౌరవ జవీణ సూచించారు. సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ సరఫరా నాణ్యతను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.

**పీక్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు చర్యలు**

విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో పీక్ అవర్స్‌లో ఎటువంటి అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. అధిక లోడ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట లోడ్ బ్యాలెన్సింగ్, అదనపు సామర్థ్యాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ వంటి చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు.

**పిఎం సూర్య ఘర్, ఆర్‌డీఎస్‌ఎస్ పథకాలపై సమీక్ష**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పిఎం సూర్య ఘర్-ముఫ్త్ బిజ్లీ యోజన, సబ్‌స్టేషన్ల నిర్మాణం, ఫీడర్ బలోపేతం తదితర పథకాల అమలు పురోగతిని సిఎండి సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పథకాల అమలులో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

# సంతమాగులూరు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా పర్యవేక్షించిన ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి

**ఇటీవల సంచలనంగా మారిన గంజాయి ఆరోపణల నేపథ్యంలో ప్రాధాన్యత**

**గంజాయి పై ఐజి విచారణ చేశాడా అనే దాని పై ఉత్కంఠత**

**సాధారణ తనిఖీ అంటున్న పోలీస్ వర్గాలు**



**(షణ్ముఖ వెలుగు, సంతమాగులూరు, అగస్టు 20)**

సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌ను గురువారం ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఎవరికి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఐజి ఆకస్మికంగా (తరువాయి 4లో...)

# మార్కాపురం సర్కిల్ పనితీరు పై సమగ్ర సమీక్ష
## వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరానే ప్రధాన లక్ష్యం




**1912 ద్వారా కొత్త విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు**

వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సేవలను పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ దిశగా తీసుకెళ్తున్నామని గౌరవ జవీణ తెలిపారు. ఇప్పటికే ఫిర్యాదుల నమోదు, సేవలకు సంబంధించిన సమాచారం, వినియోగదారుల సమస్యల పరిష్కారంలో 1912 సేవలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు అదే వేదిక ద్వారా నూతన విద్యుత్ సర్వీస్ కనెక్షన్ దరఖాస్తులను కూడా స్వీకరించే విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా వినియోగదారులకు మరింత సౌలభ్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సేవపై మార్కాపురం సర్కిల్ పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి వినియోగదారునికి సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారులు కొత్త విద్యుత్ సర్వీస్ కనెక్షన్ కోసం ఇకపై ఈ-సేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని సీఎండీ తెలిపారు. ఏపిసిపిడిసిఎల్ అధికారిక వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా ఇంటి నుంచే సులభంగా కొత్త విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**వర్షాకాలంలో విద్యుత్ భద్రతకు ప్రాధాన్యం**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ప్రమాదాల నివారణకు అన్ని రకాల భద్రతా చర్యలను కచ్చితంగా అమలు చేయాలని గౌరవ జవీణ ఆదేశించారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు, విద్యుత్ స్తంభాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని సూచించారు. విద్యుత్ సిబ్బంది విధి నిర్వహణ సమయంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, వ్యక్తిగత రక్షణ పరికరాలను వినియోగిస్తూ పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తెగిపోయిన విద్యుత్ తీగలు, తడిసిన విద్యుత్ పరికరాలు, నీట మునిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

**రెవెన్యూ వసూళ్లు, లైన్ లాస్ తగ్గింపు పై ప్రత్యేక దృష్టి**

రెవెన్యూ వసూళ్లలో మెరుగైన ఫలితాలు సాధించాలని, పెండింగ్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని గౌరవ జవీణ సూచించారు. అదే సమయంలో సాంకేతిక, వాణిజ్య నష్టాలను తగ్గించేందుకు ఫీడర్ స్థాయిలో విశ్లేషణ నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అక్రమ విద్యుత్ వినియోగంపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**వ్యవసాయ విద్యుత్ సరఫరా పై పర్యవేక్షణ**

వ్యవసాయ రంగానికి అందిస్తున్న విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు తలెత్తకుండా ఫీడర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని గౌరవ సీఎండీ సూచించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను స్థానిక అధికారులు వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు.

**వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యం**

వినియోగదారులకు పారదర్శకమైన, వేగవంతమైన మరియు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని గౌరవ జవీణ శ్రీ పి. పుల్లారెడ్డి ఆదేశించారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను కేవలం నమోదు చేయడం కాకుండా, వాటి పరిష్కార నాణ్యతను కూడా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి స్థాయిలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వినియోగదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) టీవీఎస్ఎన్ మూర్తి, మార్కాపురం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్ ఏ కరీమ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నాగేశ్వరరావు, ఉమాకాంత్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంతమాగులూరు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా పర్యవేక్షించిన ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి




పర్యవేక్షించడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల సంతమాగులూరు, బల్లికురవ ఎస్ఐలపై గంజాయి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఎస్పి హర్షవర్ధన్ రాజు ప్రెస్ మీట్ పెట్టి పోలీసుల ప్రమేయం లేదని ఖండించిన సంగతి తెలిసిందే.. అయితే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సైతం గంజాయి వ్యవహారం పై మాట్లాడటంతో రాజకీయం రసవత్తంగా మారింది. ఈ తరుణంలో ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ కొంత ప్రాధాన్యత సంతరించుకుంది. స్టేషన్ లోపల గంజాయి వ్యవహారం పై ఐజి విచారణ చేశారా లేదా అనేది ఇప్పుడు నియోజకవర్గం లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే సాధారణ తనిఖీల్లో భాగంగా ఐజి పర్యవేక్షణ చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. మొత్తం మీద ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి పర్యటన చర్చనీయాంశంగా మారింది.

# పారదర్శకంగా ప్రత్యేక ఓటరు జాబితాను రూపొందించాలి

## జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ టి ఎస్ చేతన్
## ఫిర్యాదుల విచారణ పారదర్శకంగా చేపడుతున్నాం
## జేసీ డాక్టర్ నిధీమీనా



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 20)

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026)లో భాగంగా ప్రత్యేక ఓటరు జాబితాను పారదర్శకంగా, స్వచ్ఛంగా రూపొందించాలని జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ టి ఎస్ చేతన్ ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు. కడప కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాల్ లో గురువారం ఎస్ఐఆర్-2026 లో భాగంగా జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ చేతన్ టిఎస్ జిల్లా జేసీ డాక్ట

ర్ నిధీమీనా, డిఆర్వో మల్లికార్జునుడు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ చేతన్ మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల కమీషన్ ప్రక్రియ, నిబంధనలు అమలు చేయాలన్నారు. దేశంలో పెద్ద ఎత్తున జరిగే ఎన్నికల నిర్వహణలో చిన్న తప్పు జరగకుండా ఉండాలంటే ఎన్నికల కమీషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని నూతన ఓటర్లుగా నమోదులో వివరాలు.పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనలు పాటిస్తే తప్పులు జరిగేందుకు అవకాశం ఉండదన్నారు. బిఎల్వోలు క్షేత్రస్థాయిలో 100 శాతం ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. ప్రతి ఓటర్ల జాబితాని పరిశీలన చేయాలని, బిఎల్వోలకు శిక్షణ కూడా ఇవ్వాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు వారి ఫిర్యాదులను ముందుగానే అందించాలని, క్షేత్రస్థాయిలో నాయకులకు తెలియజేసి అందరూ సహకరించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా జేసీ డాక్టర్ నిధీమీనా జిల్లాలో ఎస్ఐఆర్ నిర్వహణ గురించి వివరిస్తూ జిల్లాలో మొత్తం 18,96,231 మంది ఓటర్లు ఉండగా, జూలై 24 నాటికి 64,434 మంది (3.40 శాతం) మ్యాపింగ్ కాని ఓటర్లు, 2,43,180 మంది 12.82 శాతం మ్యాపింగ్‌లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లు ఉన్నట్లు జేసీ డా. నిధిమీనా తెలిపారు. కడప నియోజకవర్గంలో అత్యధికంగా 25,538 మంది మ్యాపింగ్ కాని ఓటర్లు ఉన్నారని వివరించారు. ఆగస్టు 20 నాటికి 3,07,685 నోటీసులను 100 శాతం జనరేట్ చేశామని, ఎక్కడా పెండింగ్ లేదని తెలిపారు. జిల్లాలోని 2,251 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బీఎల్ఓ-బీఎల్ఏ సమావేశాల మినిట్స్ కూడా పూర్తిగా అప్‌లోడ్ చేశామని వెల్లడించారు. ఫారాలు 9, 10, 11, 11ఏ, 11బీ ప్రచురణ అనంతరం ఏడు రోజుల నోటీసు గడువు ముగిసిన వెంటనే ఫారాలు 6, 6ఏ, 7, 8 పరిష్కార ప్రక్రియ చేపట్టాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ చేతన్ టి.ఎస్. సూచించినట్లు జేసీ తెలిపారు. సెప్టెంబర్ 21లోపు నోటీసుల ప్రక్రియ, సెప్టెంబర్ 28లోపు విచారణలు, తుది ఉత్తర్వులు పూర్తి చేయాలని సూచించినట్లు వివరించారు. అలాగే ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించి, బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు తెలిపారు. ఎన్‌జీఎస్‌పీ ద్వారా వచ్చిన 3,162 ఫిర్యాదుల్లో 3,098 మూసివేసి, 49 పరిష్కరించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా 2,251 కేంద్రాలను 2,444కు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, కొత్తగా 193 కేంద్రాల ఏర్పాటు, 20 కేంద్రాల మార్పు, 20 కేంద్రాల పేర్ల మార్పునకు ప్రతిపాదనలు పూర్తయ్యాయని జేసీ డా. నిధిమీనా వివరించారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.




# ఆర్ అండ్ ఆర్ యాక్టును పటిష్టంగా అమలు చేయండి

**ఆరు నెలలు సమయం ఇవ్వాలని యాక్టులో ఉంది**
**లక్ష్మీపురం గ్రామాన్ని 24న ఖాళీ చేయిస్తే అడ్డుకుంటాం**
**గిద్దలూరు వైయస్ఆర్సీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి**




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 20)

వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైతున్న కాకర్ల గ్యాప్‌లోని మాగటూరు తాండలోని లక్ష్మీపురం, కృష్ణానగర్ గ్రామాల వారికి పూర్తి స్థాయిలో ఆర్అండ్ఆర్ ప్యాకేజి, పునరావాసం కల్పించి 6 నెలల సమయం ఇచ్చి ఖాళీ చేయించాలని, అలా కాకుండా బలవంతంగా, దౌర్జన్యంగా ఖాళీ చేయిస్తే అడ్డుకుంటామని గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కేపి నాగార్జునరెడ్డి హెచ్చరించారు. నిర్వసితులతో కలిసి ఆయన గురువారం కలెక్టర్ విజయసునీతను కలిశారు. నిర్వసితుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మిడియాతో మాట్లాడూతూ 2013 ఆర్ఆర్ యాక్టులోని 38వ క్లాజ్ ప్రకారం నిర్వాసితులందరికి నష్టపరిహారం ఇచ్చి 6 నెలలు గడువు ఇవ్వాలని ఉందని, చట్ట ప్రకారం అధికారులు ముందుకు వెళ్ళాలన్నారు. ఈ నెల 24న అధికారులందరూ ఆ గ్రామాలనికి వెళ్ళి ఎలాగైన ఖాళీ చేయిస్తామని చెపుతున్నారని, అలా చేస్తే తాము అడ్డుకుంటామని చెప్పారు. 2019లో నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ కటాఫ్ తేదిని పెంచి నిర్వాసితులకు న్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం కూడా నీళ్ళు వదిలే తేదిని కటాఫ్ డేట్‌గా తీసుకుని ఆర్ఆర్ ప్యాకేజి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్ష్మీపురం గ్రామంలో సుమారు 500 ఎకరాలలో లక్షాలాది రూపాయలు ఖర్చుపెట్టి పంటలు వేశారని, ఉన్న ఫలంగా ఖాళీ చేయమంటే వారి పరిస్థితి ఎంటన్నారు. ఈ గ్రామాలలో సుమారు 500 నుంచి 600 వరకు పశువులు ఉన్నాయని వారందరు ఇళ్ళను ఖాళీ చేసి ఎక్కడ ఉండాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన పునరాలోచించి నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు డాక్టర్ మొర్రి పిచ్చయ్య అభినందనలు



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 20)

జాతీయ ప్రతిభా పరీక్షలో ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు ఎంపికైన గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యాదవ బజార్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు హమీద్, ఫర్వీన్‌లను డాక్టర్ మొర్రి పిచ్చయ్య అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభా పరీక్షకు సిద్ధమయ్యేందుకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల పట్టుదల, క్రమశిక్షణతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఈ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాన్ని అభినందిస్తూ హమీద్, ఫర్వీన్‌లకు పెన్నులను బహూకరించి, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అవసరమైన విద్యా సహాయాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ, ఉపాధ్యాయులు రంగస్వామి, జీవన్, లీలావతి, అరుణ, గౌహర్, వాహిద్ తదితరులు డాక్టర్ మొర్రి పిచ్చయ్యను సన్మానించి విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని అభినందించారు. "ప్రతిభకు ప్రోత్సాహం-విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట" అనే స్ఫూర్తితో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్య సేవలను పలువురు ప్రశంసించారు.

## సద్భావనతోనే సమాజ అభివృద్ధి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 20)

సద్భావన దినోత్సవం సందర్భంగా గురువారం కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని పాతూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు జాతీయ సమైక్యత, మత సామరస్యం, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ, సమాజంలో శాంతి, సోదరభావాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అన్ని మతాల ప్రజల మధ్య సామరస్యాన్ని కాపాడాలని, కుల మత బేధాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని తెలిపారు. హింసను విడనాడి సద్భావనతో జీవించాలని, చట్టాల పై అవగాహన కలిగి మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. సద్భావనతోనే సమాజ అభివృద్ధి చెందుతుందని, విద్యార్థులు సమాజ అభివృద్ధికి, దేశ శాంతికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రపంచ దోమల దినోత్సవం పై అవగాహన ర్యాలీ

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 20)

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు కనిగిరి పట్టణంలో మలేరియా సబ్ యూనిట్, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఇందిరా కాలనీ గార్లపేట రోడ్డు ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కనిగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుండి ఆర్డీఓ ఆఫీసు వరకు ప్లకార్డ్స్‌తో చేపట్టారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్స్ వైద్యాధికారి డాక్టర్ కమ్యూనిటీ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సురేష్, సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎంవి విజయభాస్కర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఇంటి చుట్టుపక్కల నీరు నిలవ లేకుండా చూడాలని, దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దోమతెరలు వాడాలని చిన్న దోమ కాటు వల్ల పెద్ద ప్రమాదము ఉంటుందని తెలియజేసినారు తదుపరి సర్ రోనాల్డ్ రాస్ గురించి మాట్లాడుతూ 1897లో ఆడ దోమ ద్వారా పరాన్నజీవిని గుర్తించడం ద్వారా మలేరియా అనే వ్యాధి వస్తుందని నిర్ధారణ చేయడం జరిగింది. దీనికి గాను వైద్యశాస్త్రంలో 1902 నోబుల్ బహుమతి అందుకున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ లోని ఆయన నిర్వహించిన పరిశోధనలు మలేరియా చరిత్రలో అత్యంత కీలకమైనవిగా నిలిచాయి. రాస్ కేవలం వైద్య శాస్త్రవేత్త మాత్రమే కాదు. ఆయన కవి, రచయిత, సంగీత అభిమాని, గణిత శాస్త్రవేత్త, కళాభిలాషి కూడా భారతీయ వైద్య సేవలో సుమారు 25 సంవత్సరాలు పని చేసిన ఆయన అనంతరం వర్పూల్ స్కూల్ ఆఫ్ ట్రాపికల్ మెడిసిన్లు అధ్యాపకుడిగా ప్రొఫెసర్‌గా, చైర్మన్‌గా సేవలందించారని తెలిపారు. రాస్ ఇన్స్టిట్యూషన్ అండ్ హాస్పిటల్ ఫర్ ట్రాపికల్ డిసీజెస్ డైరెక్టర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జీవి ఫణి, డాక్టర్ సురేష్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎంవి విజయభాస్కర్, ఆరోగ్య కార్యకర్తలు, నాగరాజు, తిరుపతయ్య, రామకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





# పాఠశాలలకు గ్రో బ్యాగ్స్ పంపిణీ

(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 20)

పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారం, సేంద్రియ సాగు, మొక్కల పెంపకం పట్ల అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన స్కూల్ న్యూట్రి గార్డెన్ కార్యక్రమంలో భాగంగా కంభం మండలంలో తగిన స్థలం లేని పాఠశాలలకు గురువారం ఎంఈవో అబ్దుల్ సత్తార్ గ్రో బ్యాగ్స్ కిట్లను పంపిణీ చేశారు. స్థలం కొరత కారణంగా పాఠశాల ప్రాంగణంలో నేరుగా న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు చేయలేని పాఠశాలల్లో కూడా విద్యార్థులకు మొక్కల పెంపకం, కూరగాయల సాగుపై ప్రత్యక్ష అనుభవం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కిట్లను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. పంపిణీ చేసిన కిట్లలో కోకోపీట్, వర్మీ కంపోస్ట్, వివిధ రకాల విత్తనాలు, స్ప్రే బాటిల్, నీం ఆయిల్, గ్రో బ్యాగ్స్ తదితర సామగ్రి ఉన్నాయనీ,వీటిని ఉపయోగించి తక్కువ స్థలంలోనే కూరగాయలు, ఆకుకూరలు, ఇతర పోషక విలువలు కలిగిన మొక్కలను పెంచుకోవచ్చన్నారు. గ్రో బ్యాగ్స్‌లో మొక్కలను పెంచే విధానం, కిట్లలోని వస్తువుల ఉపయోగం, మొక్కల సంరక్షణ, నీటి వినియోగం, సహజ పద్ధతుల్లో తెగుళ్ల నివారణ వంటి అంశాలపై ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు. కోకోపీట్ మొక్కల వేర్లకు తగిన తేమను నిలుపుకోవడంలో సహాయపడుతుందని, వర్మీ కంపోస్ట్ మొక్కలకు అవసరమైన సేంద్రియ పోషకాలను అందిస్తుందని, విత్తనాలను తగిన లోతులో నాటడం, మొక్కలకు అవసరమైన మేరకు నీటిని అందించడం, అధిక నీటితో వేర్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కలకు తెగుళ్లు సోకకుండా నీం ఆయిల్‌ను సూచించిన పద్ధతిలో నీటితో కలిపి స్ప్రే చేయడం ద్వారా సహజ పద్ధతిలో సంరక్షణ చేపట్టవచ్చని వివరించారు. స్ప్రే బాటిల్‌ను అవసరమైన సమయంలో మాత్రమే వినియోగించాలని సూచించారు. న్యూట్రీ గార్డెన్ ద్వారా విద్యార్థులకు కేవలం మొక్కల పెంపకం మాత్రమే కాకుండా విత్తనం నుంచి మొక్క ఎదుగుదల వరకు జరిగే ప్రక్రియను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభిస్తుందనీ, పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ సాగు, పోషకాహారం, పరిశుభ్రత, ప్రకృతి పట్ల బాధ్యత వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. పాఠశాలల్లో పెంచే కూరగాయలు, ఆకుకూరల ద్వారా తాజాగా లభించే పోషకాహారం ప్రాముఖ్యతను విద్యార్థులు అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని,స్థలం అందుబాటులో లేని పాఠశాలల్లో గ్రో బ్యాగ్స్ విధానం తక్కువ స్థలంలో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం

## రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వివరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 20)

జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కు వివరించారు. గురువారం విజయవాడ నుండి ఎస్ఐఆర్ నిర్వహణ, పురోగతి పై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో కడప జిల్లా కలెక్టర్ బంగ్లా నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొని, జిల్లాలో ఎస్ఐఆర్ పురోగతిని వివరించారు. జిల్లాలో మొత్తం 3,07,685 నోటీసులు జారీ చేయాల్సి ఉండగా అన్నింటినీ జారీ చేశామని, ఇప్పటివరకు 2,51,371 నోటీసులు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే 32,949 విచారణలు పూర్తిచేసినట్లు వివరించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంలో భాగంగా ఫారం 6, ఫారం 7, ఫారం 8 ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి ధ్రువీకరణ, ఓటర్ల జాబితా నవీకరణ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఫారం 7 కింద 2,66,041 దరఖాస్తులు అందగా, వాటిలో 2,62,915 దరఖాస్తులు ఆమోదించబడినట్లు వివరించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలు, క్లెయిమ్‌లు అభ్యంతరాల పరిష్కారం, ధ్రువీకరణ ప్రక్రియలను వేగవంతం చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్డు మీటింగ్ హాలు నుండి డీఆర్వో మల్లికార్జునుడు, ఎస్డీసి వెంకటపతి, సంబంధిత ఎన్నికల, రెవెన్యూ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో వైభవంగా ప్రతిష్టా దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, ఆగస్టు 20)

స్థానిక అమ్మవారిశాలలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవస్థానంలో బుధవారం నిజ శ్రావణ శుద్ధ సప్తమిని పురస్కరించుకుని అమ్మవారి ప్రతిష్టా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, మంగళహారతితో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఉదయం 7 గంటలకు పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శ్రీ గణపతి, రుద్ర, నవగ్రహ, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు మధ్యాహ్నం 12 గంటలకు అవభృథస్నానం మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

**వజ్రాల అలంకరణలో అమ్మవారి దర్శనం**

ప్రతిష్టా దినోత్సవాన్నిలి పురస్కరించుకుని అమ్మవారిని వజ్ర కిరీటంలి డైమండ్ శారీతో అలంకరించారులివిశేష అలంకారంలో దర్శనమిచ్చిన దేవినిలి దర్శించుకుని భక్తులు తరించారులి. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి, ఉత్సవాలకు ధన, వస్తు రూపంలో సహకరించిన దాతలను ఆర్యవైశ్య సభ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అలాగే దసరా ఉత్సవాల దాతలకు "ఒడిబియ్యం" సమర్పించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి మల్లెంకొండు ప్రతాప్, కోశాధికారి జాలాది పరమేశ్ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొని, భక్తులకు అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు.









## జర్నలిజంలో డిప్లమో కోర్సుకు దరఖాస్తు గడువు పెంపు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 20)

సిఆర్ మీడియా అకాడమీ, నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న "జర్నలిజంలో డిప్లమో కోర్సు"కు దరఖాస్తు గడువును సెప్టెంబర్ 5 వరకు పొడిగించినట్లు మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు పట్ల వివిధ వర్గాల నుండి వస్తున్న విచారణలు, డిమాండ్ దృష్ట్యా, జర్నలిస్టు సంఘాలు, పాత్రికేయుల విజ్ఞప్తి మేరకు గడువును పొడిగించామని ఆయన తెలిపారు. ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకునే జర్నలిస్టులు రూ.2 వేలు, ఇతర అభ్యర్థులు రూ.2,500 కోర్సు ఫీజును చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజును సెక్రెటరీ, సిఆర్ మీడియా అకాడమీ పేరున ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో తీసుకోవాల్సి ఉంటుందన్నారు. జర్నలిస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, జర్నలిజంలో అభిరుచి కలిగిన ఇతర అభ్యర్థులకు డిగ్రీ ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు.

## మైదుకూరు సబ్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో విద్యుత్ బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ ఈఈ డి లక్ష్మీపతి

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 20)



మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పేరుకుపోయిన విద్యుత్ పెండింగ్ బకాయిల వసూలు కోసం ఈ నెల 22 (శనివారం) ప్రత్యేక అధికారులతో ప్రత్యేక కార్యాచరణను ఏర్పాటు చేసినట్లు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) డి.లక్ష్మీపతి తెలిపారు. మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు, వనిపెంట సెక్షన్ల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల నుంచి కోట్ల రూపాయల బకాయిలు రాబట్టాల్సి ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోజువారీ క్రమంలో విద్యుత్ సిబ్బంది అన్ని కాలనీలలో వసూళ్ల కోసం హాజరవుతారని పేర్కొన్నారు. ప్రతినెలా బిల్లులు అందజేస్తున్నప్పటికీ బకాయిలు చెల్లించని సర్వీసులకు విద్యుత్ సరఫరాను తొలగిస్తారు. బకాయి మొత్తం ఎక్కువగా ఉన్న వినియోగదారులు సులభంగా చెల్లించేందుకు వాయిదాల వెసులుబాటు కల్పించడమైనది. 200 యూనిట్ల నిబంధన: ప్రభుత్వం ఉచితంగా కల్పించిన నెలకు 200 యూనిట్ల పరిమితి దాటి వినియోగించిన ప్రతి ఒక్కరూ నెలవారీ బిల్లును తప్పనిసరిగా చెల్లించాలి. వినియోగదారులు ఎటువంటి ఆలస్యం లేకుండా బకాయిలు చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని, ఈ ప్రక్రియకు ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా సహకరించాలని ఈఈ లక్ష్మీపతి విజ్ఞప్తి చేశారు.

## మండలంలో డీఈవో ఆకస్మిక తనిఖీలు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 20)

మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు మండలంలోని పలు పాఠశాలలను గురువారం విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మండలంలోని కేతగుడిపి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ, మధ్యాహ్న భోజన పథకాన్ని నిశితంగా పరిశీలించారు. పాఠశాలలో మెనూ ప్రకారంగా తయారు చేసిన రాగి జావను స్వయంగా పరిశీలించి తాగి రుచిని చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించే విధానాన్ని, పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధిలో విద్యార్థులు ఎలా రాణించాలో అనే అంశం పై ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# వనిపెంట గురుకులంలో పార్తీనియం నిర్మూలన అవగాహన సదస్సు

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 20)

స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంగణంలో గురువారం పార్తీనియం (వయారి భామ) కలుపు మొక్కల నిర్మూలన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పార్తీనియం నిర్మూలన వారోత్సవాల్లో (ఆగస్టు 16--22) భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వారి బృందం ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పార్తీనియం మొక్కల వల్ల పర్యావరణానికి, పంట దిగుబడులకు, పశువులతో పాటు మానవ ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు పార్తీనియం మొక్కలను గుర్తించే విధానం, వాటిని సమర్థవంతంగా నిర్మూలించే పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి శ్రమదానం ద్వారా పాఠశాల ప్రాంగణంలోని పార్తీనియం, ఇతర అనవసర కలుపు మొక్కలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో బాధ్యతా భావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రిన్సిపాల్ నిర్మలారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.








# బాల భవిత కేంద్రంలో చిన్నారులకు ఉపకరణాల పంపిణీ










**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)**

రిమ్స్ లోని జిల్లా బాల భవిత కేంద్రంలో జిల్లా వైద్యశాఖ వారి ఆధ్వర్యంలో రూ.8 లక్షల ఖరీదైన పరికరాలు ఒమేగా రిహబిలిటేషన్ ఫౌండేషన్ బెంగళూరు వారి ఆర్థిక సహకారంతో 18 సంవత్సరాల లోపు చిన్నారులకు ఆర్థోటిక్స్,ప్రొస్థటిక్స్,వీల్ చైర్లు, ట్రై సైకిల్స్‌ను ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. జిజిహెచ్ సూపర్నెంట్ డాక్టర్ మాణిక్యరావు, డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ ఎన్ కిరణ్, ఆర్ఎంఓ డాక్టర్ మాధవి లత, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి భగీరథ, రిమ్స్ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ ప్రభాకర్, చిన్నారుల నిపుణులు డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ భాషా, డెర్మటాలజిస్ట్ డాక్టర్ ఏడుకొండలు, తదితరులు పాల్గొని జయప్రదం చేశారు. ఒమేగా రిహాబిలిటేషన్ ఫౌండేషన్ నిర్వాహకులు దినేష్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అదే విధంగా మేము సైతం ఫౌండేషన్ నిర్వాహకులు, జనసేన నాయకులు శ్రీను అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి మాట్లాడుతూ చిన్నారులకు ప్రభుత్వం నుంచి మరింత సహాయ, సహకారాలు అందజేస్తామన్నారు. వీరిలో ఇంకా మానసిక అంగవైకల్యం ఉన్నవారికి, అదే విధంగా గుండె జబ్బులు కలిగిన వారికి తగు వైద్య సహకారాలు అందించాలని వైద్యులను కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన చిన్నారులకు పెన్షన్లు శాంక్షన్ చేయుటకు గాని, వారికి వైద్య చికిత్సలు అందించటం కానీ వైద్యులు ఎప్పుడు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలియజేశారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి భాగీరథి మాట్లాడుతూ ఒమేగా రిహాబిలిటేషన్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వారు ఇచ్చిన పరికరాలు సుమారు రూ.8 లక్షల రూపాయలు ఖరీదు అని, ఇవి గ్రామాల్లో సైతం క్యాంపులు నిర్వహించి తల్లిదండ్రులకు, చిన్నారులకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంగవైకల్య విభాగం అడిషనల్ డైరెక్టర్ సువార్త, నరసింహారావు, జిల్లా బాల భవిత కేంద్రం వైద్యులు, ఫిజియోథెరపిస్టు సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టసభల్లోనూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



**(షణ్ముఖ వెలుగు, చీరాల, ఆగస్టు 20)**

స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాకుండా చట్టసభల్లోనూ బీసీలకు జనాభా దామాషా ప్రకారం 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. గురువారం పెండింగ్ ఎస్సీ, ఎస్టీ కేసుల విషయమై చీరాల డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఆయన అంబేద్కర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మూడేళ్లుగా ఒక్క రూపాయి సబ్సిడీ రుణం కూడా ఇవ్వని కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ఓట్ల కోసం 34 శాతం రిజర్వేషన్ల పేరుతో ప్రచారం చేస్తోందని విమర్శించారు. బీసీలపై నిజమైన ప్రేమ ఉంటే ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లోనూ 34 శాతం రిజర్వేషన్లు కల్పించి సీట్లు కేటాయించాలని కోరారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇస్తామని ప్రకటించి ఇప్పటివరకు ఒక్కరికీ ప్రయోజనం కల్పించలేదన్నారు. కేంద్రంలోని ఎన్‌బీసీఎఫ్‌డీసీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వకపోవడంతో బీసీ నిరుద్యోగులకు రుణాలు అందడం లేదని ఆరోపించారు. 'ఆదరణ' పథకం కూడా బీసీలకు పూర్తిస్థాయిలో చేరలేదన్నారు. బీసీ మహిళలకు కుట్టుమిషన్లపై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించినా మిషన్లు ఇవ్వలేదని విమర్శించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో కొత్త పుస్తకాలు అందుబాటులో లేకపోవడం, విదేశీ విద్య హామీలు అమలు కాకపోవడం వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. బీసీ కులాలన్నింటికీ సమానంగా సంక్షేమ పథకాలు, పెన్షన్లు అందించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లోనే కాకుండా ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లోనూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నాగేంద్రరావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, పత్రా బంగారం, మురళి, తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతుల మద్దతు ధర పై చర్చే లేదు రాజకీయ విమర్శలతోనే గడిచిపోతున్న అసెంబ్లీ సమావేశాలు

### ఆప్ నేత నేతి మహేశ్వరరావు, సీపీఐ నాయకుడు బి సురేష్







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 20)**

పొగాకు రైతులు తీవ్ర ధరల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, వారి మద్దతు ధర సమస్యపై అసెంబ్లీలో చర్చ జరగకపోవడం దురదృష్టకరమని ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నేతి మహేశ్వరరావు విమర్శించారు. పొగాకు రైతుల ప్రస్తుత పరిస్థితులు, ధరల పతనం, కొనుగోలు సమస్యలను తెలుసుకునేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు నేతి మహేశ్వరరావు, సీపీఐ కందుకూరు కార్యదర్శి బి సురేష్‌తో కలిసి పామూరు రోడ్డులోని పొగాకు బోర్డు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు ధర కనిష్టంగా క్వింటాల్‌కు రూ.11 వేల వరకు పడిపోవడం రైతులను ప్రభుత్వాలు గాలికి వదిలేసిన పరిస్థితికి నిదర్శనమన్నారు. 'చీశీ దీఱఅం' పేరుతో కొన్ని పొగాకు బేళ్లకు కొనుగోలుదారులు బిడ్లు వేయకుండా వెనక్కి పంపుతున్న పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. చివరకు "ఎంతో కొంతకు కొనుగోలు చేస్తే చాలు" అనే నిస్సహాయ స్థితికి రైతులను నెట్టివేస్తున్నారని ఆరోపించారు. ఇది పొగాకు కొనుగోలు వ్యవస్థలో ఏర్పడిన సిండికేట్ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. కందుకూరు, కొండేపి నియోజకవర్గాలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఉన్నప్పటికీ, కనీసం పొగాకు రైతుల మద్దతు ధర సమస్యను అసెంబ్లీ చర్చకు తీసుకురాలేకపోవడం రాజకీయ వ్యవస్థ ఎంతగా దివాళా తీసిందో తెలియజేస్తోందన్నారు. పొగాకు రైతుల మద్దతు ధరపై చర్చే లేకుండా, ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటూ అసెంబ్లీ సమావేశాలు ముగియడం బాధాకరమన్నారు.

పొగాకు కంపెనీల వ్యాపారం రైతులు పండించే పొగాకు పంటపైనే ఆధారపడి ఉందని మహేశ్వరరావు అన్నారు. కంపెనీలకు అవసరమైన ముడిసరుకును రైతులే అందిస్తున్నప్పుడు, వారికి గిట్టుబాటు ధర రాని పరిస్థితి కొనసాగితే రైతులు సమిష్టిగా పొగాకు సాగును వదిలేయడంపైనా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు పంట వేయకపోతేనే పొగాకు సిండికేట్ అరాచకానికి అడ్డుకట్ట పడుతుందని తెలిపారు. రాబోయే ఏడాది పొగాకు సాగు చేయబోమని రైతులందరూ ఐక్యంగా ఒకే నిర్ణయంపై నిలబడితే, కంపెనీలు రైతుల వద్దకు వచ్చి చర్చించి గిట్టుబాటు ధర ఇవ్వాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఒకవేళ సరైన ధర లభించకపోతే, పొగాకు సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్‌గా రైతులకు తన సూచన ఏమిటంటే, కంపెనీలకు అవసరమైన ముడిసరుకును మీరు అందిస్తున్నప్పుడు ధరను నిర్ణయించే స్థాయిలో రైతులు ఉండాలని మహేశ్వరరావు పేర్కొన్నారు. కానీ రైతుల్లో ఉన్న అనైక్యత, రాజకీయ పార్టీల ఆధారంగా విడిపోయిన ఆలోచనలు, "ఎంతో కొంతకు అమ్మేసుకుందాం" అనే సర్దుకుపోయే మనస్తత్వమే కంపెనీల దోపిడీకి బలంగా మారుతున్నాయని అన్నారు. రైతుల అనైక్యతే పొగాకు కంపెనీల బలం అని స్పష్టం చేశారు. దూబగుంట రోడ్డులోని పొగాకు బోర్డు కేంద్రం వద్ద రైతుల్లో కనిపిస్తున్న ఐక్యత, పామూరు రోడ్డులోని పొగాకు బోర్డు కేంద్రం పరిధిలోని రైతుల్లో అదే స్థాయిలో కనిపించడం లేదని ఆయన అన్నారు. రైతులందరూ ఐక్యంగా ఒకే మాటపై నిలబడినప్పుడే ప్రభుత్వాలు, కంపెనీలు వారి సమస్యలను సీరియస్‌గా తీసుకుంటాయని తెలిపారు. లేదంటే "ఎంతకైనా అమ్మేస్తాం" అనే పరిస్థితిని సిండికేట్ తనకు అనుకూలంగా మార్చుకుని, ధరలను మరింత తగ్గించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పొగాకు రైతు తన పంటకు గిట్టుబాటు ధర పొందాలంటే ఐక్యతే అతిపెద్ద ఆయుధం. రాజకీయాలకు అతీతంగా రైతులంతా ఒకే వేదికపైకి వచ్చి తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.

# జూడాల సమ్మె నేపథ్యంలో జీజీహెచ్‌లో పరిస్థితిని సమీక్షించిన డీఆర్వో వెంకటరమణ

**జీజీహెచ్‌లో వైద్యులతో సమావేశం నిర్వహించిన డీఆర్వో**
**సమ్మె నేపథ్యంలో తీసుకుంటున్న ప్రత్యామ్నాయ చర్యలను వివరించిన సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు**
**డీసీహెచ్ మెడికల్ కాలేజీ నుంచి అదనపు వైద్యుల సేవలు**
**అన్ని క్లినికల్ విభాగాల్లో సేవలను పర్యవేక్షించేందుకు నోడల్ అధికారుల నియామకం**
**అత్యవసర, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

జూడాల సమ్మె నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (ఒంగోలులో) వైద్య సేవల పరిస్థితిని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ సమీక్షించారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లోని వివిధ విభాగాల వైద్యులతో సమావేశం నిర్వహించి, అత్యవసర వైద్య సేవలు, సూపర్ స్పెషాలిటీ సేవలు, క్లినికల్ విభాగాల పనితీరు, సమ్మె నేపథ్యంలో చేపట్టిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. సమ్మె ప్రారంభమైన మొదటి రోజు నుంచే రోగులకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు డీఆర్వో వెంకటరమణకు వివరించారు. అన్ని క్లినికల్ విభాగాల్లో సేవలను నిరంతరం పర్యవేక్షించేందుకు నోడల్ అధికారులను నియమించి, వారి ద్వారా విభాగాల వారీగా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు మాట్లాడుతూ జూడాల సమ్మె సమయంలో వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఐవీసూ పరిధి నుంచి 18 మంది వైద్యులు, ఐజుల నుంచి 15 మంది వైద్యులు, మెడికల్ కాలేజీ నుంచి 16 మంది వైద్యులు, మొత్తం 49 మంది వైద్యులతో పాటు ట్యూటర్స్, మెడికల్ డీఎంహెచ్‌వోలోని వివిధ క్లినికల్ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరి సేవలను అవసరానికి అనుగుణంగా వివిధ విభాగాల్లో వినియోగిస్తూ రోగులకు నిరంతర వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ప్రత్యేకంగా ఎమర్జెన్సీ, ఐసీయు సూపర్ స్పెషాలిటీ, ఇతర కీలక విభాగాల్లో వైద్య సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని సూపరింటెండెంట్ తెలిపారు. సమ్మె మరింత కొనసాగిన పక్షంలో కూడా రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అదనపు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు ఆసుపత్రి యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. సమ్మె ప్రారంభమైన రోజు నుంచి ఇప్పటి వరకు ఆసుపత్రి వైద్య సేవలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడలేదు. అన్ని విభాగాల్లో సేవలను నోడల్ అధికారుల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. అదనపు వైద్యుల సహకారంతో రోగులకు అవసరమైన వైద్య సేవలను నిరంతరంగా అందిస్తున్నాం. రోగుల భద్రత, అత్యవసర వైద్యం, నిరంతర సేవలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ ప్రభాకర్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవీలత, డాక్టర్ సునీల్, డాక్టర్ లక్ష్మా నాయక్, డాక్టర్ తేజతో పాటు జీజీహెచ్‌లో అన్ని విభాగాల వైద్యులు పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం, వైద్య అధికారులు, ఆసుపత్రి సిబ్బంది సమన్వయంతో జూడాల సమ్మె పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, జీజీహెచ్ వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.





# చంద్రబాబు ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారు: ఎంపీ శ్రీభరత్



(షణ్ముఖ వెలుగు,అమరావతి,ఆగస్టు 20)

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని ఏపీ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని విశాఖపట్నం టీడీపీ ఎంపీ శ్రీభరత్ స్వాగతించారు. విశాఖపట్నం ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి కూటమి భాగస్వామ్య పక్షాలు భారీ విజయం సాధిస్తాయని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాల నుంచి రాష్ట్రం ఇంకా పూర్తిగా కోలుకోలేదని, ప్రత్యర్థి పార్టీలో ఉన్నవారికి తమ బాధ్యత ఏంటో కూడా అర్థం కావడం లేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఆదర్శవంతమైన పాలన అందిస్తోందని కొనియాడారు.ఇక ప్రాంతీయ నీటి ఎద్దడి అంశంపై స్పందిస్తూ... ఎల్‌నినో ప్రభావం వల్లే తాగునీటి ఎద్దడి సమస్యలు తలెత్తుతున్నాయని స్పష్టం చేశారు. నీటి కొరతను ఆసరాగా చేసుకుని రాబోయే డేటా సెంటర్ల వల్ల నీటి సమస్యలు వస్తున్నాయంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డేటా సెంటర్లు ఏర్పాటు కావడానికి ఇంకా రెండేళ్ల సమయం పడుతుందని వివరించారు. కేవలం వర్షాలపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పోలవరం నీటిని విశాఖపట్నానికి తరలించే ఏర్పాట్లు వేగవంతం అవుతున్నాయని, భవిష్యత్తులో నదుల అనుసంధానం పూర్తయితే దక్షిణ భారతదేశంలో నీటి సమస్య పూర్తిగా తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉత్తమ ఉపాధ్యాయినికి జిల్లా కలెక్టర్ అభినందనలు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 20)

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పది పాఠశాలలను ఎంపిక చేసి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం అవార్డులను ప్రధానం చేసింది. ఇందులో భాగంగా మార్కాపురం జిల్లా అర్ధవీడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బెస్ట్ యావరేజ్



విభాగంలో ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు విశేష కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత దంపతులను జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. దృష్టి లోపం ఉన్నప్పటికీ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తూ పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, వారికి నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని ఆమె అన్నారు. అర్ధవీడు జడ్పీ ఉన్నత పాఠశాల ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి, ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సామా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# 34% బీసీ రిజర్వేషన్ చారిత్రాత్మకం
# చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయటం హర్షించదగ్గ విషయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బీసీ నాయకులు, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు అన్నారు. అసెంబ్లీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ప్రవేశపెట్టిన సందర్భంగా నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీలో ఉన్నందుకు చాలా గర్వపడుతున్నామని అన్నారు. విద్యార్థి దశ నుంచి అన్న నందమూరి తారక రామారావు ప్రవేశపెట్టిన తెలుగుదేశం పార్టీలో పనిచేస్తూ అంకితభావంతో పనిచేస్తున్నామని ఆనాడు 20% ఎన్‌టి రామారావు రిజర్వేషన్ ఇస్తే నేడు 34% కూటమి ప్రభుత్వం చంద్రబాబునాయుడు నాయకత్వంలో జరిగిందని అన్నారు. బీసీలందరూ కూడా మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారని కానీ గత వైఎస్ఆర్సిపి కాలంలో బీసీలందరినీ అనకు దిక్కున చరిత్ర ఉందని ఎందుకు ఆ పార్టీలో ఉంటున్నారు అర్థం కావట్లేదని అన్నారు. రిజర్వేషన్లు ఫలాలు స్థానిక సంస్థల్లో ఎంపీపీలు, జడ్పీ చైర్మన్లు, కార్పొరేటర్లు పంచాయతీ సర్పంచులు అలా అనేక పదవులు ఎక్కువగా బీసీలు పొందే అవకాశం ఉందని అందుకు ఈ నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలుగుదేశం పార్టీకి ఎప్పుడు కూడా బీసీ రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు బండారు మదన్, బీసీ నేతలు బలగాని వెంకటేశ్వర్లు, నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ డైరెక్టర్ నిడమనూరు రమేష్, కొఠారి నాగేశ్వరరావు, తిప్పరపల్లి రవితేజ, బిసి సంఘ నాయకులు దొడ్డక చంద్రశేఖర్, గుంటూరు రాంబాబు, కుర్రా అయ్యప్ప, కూరపాటి



కాశీరావు, వెంకటేశ్వర్లు (క్లాసిక్), యాసరపు ఏడుకొండలు, తంజావూరి శ్రీనివాస్ మూర్తి ఆచారి, తమ్మిశెట్టి రమాదేవి, టి అనంతమ్మ, బీసీ సంఘం నేతలు పాల్గొన్నారు.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com